'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

వీవీ ప్యాట్లు - వివాదం

మన దేశంలో పేపర్ బ్యాలెట్ స్థానంలో ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషిన్ (ఈవీఎం)ను ప్రవేశపెట్టినప్పటి నుంచీ వివాదాలు తలెత్తుతూనే ఉన్నాయి. ఈవీఎంలను హ్యాకింగ్ చేసి ఓటరు తీర్పును తారుమారు చేయొచ్చనే అనుమానాలు విస్తారంగా వ్యాప్తిలోకి రావడమే అందుకు కారణం. కొందరు ఔత్సాహికులు ఇచ్చిన హ్యాకింగ్ ప్రదర్శనలతో ఇవి మరింత బలపడుతూ వచ్చాయి. వీటి నివృత్తికి 2017 నుంచి నూరు శాతం ఈవీఎంలకు వీవీప్యాట్లు అమర్చారు. అంటే మరోసారి ఓటింగ్‌లో కాగితాలను ప్రవేశపెట్టినట్టు! ఎలక్ట్రానిక్ ఓటింగ్ వివరాలతో పాటుగా అయా గుర్తులతో కూడిన కాగితపు స్లిప్పులను వీటిలో భద్రపరుస్తారు. లెక్కింపు సమయంలో అప్పటికప్పుడు ఎంపిక చేసిన పోలింగ్ కేంద్రాల్లోని వీవీ ప్యాట్లను ఎలక్ట్రానిక్ ఓటింగ్‌తో సరిపోల్చి చూస్తారు. వీవీ ప్యాట్ల లెక్కింపు మొదట అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఒకటిచొప్పున ఎంపిక చేసేవారు. తర్వాత ఈ సంఖ్యను ఐదుకు పెంచారు. వీటిని చీటీల పద్ధతిలో ఎంపిక చేస్తారు. అయినా ఈ వ్యవస్థను అనుమానాలు వెన్నాడుతూనే ఉన్నాయి. ఎంపిక చేసిన ఐదు బూత్‌లలోనే ఎందుకు వీవీప్యాట్ల లెక్కింపు జరగాలి? నూటికి నూరు శాతం తనిఖీ చేయాల్సిందేననే డిమాండ్లూ మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రజాస్వామిక సంస్కరణల సంస్థ (ఏడీఆర్) గత ఏడాది మార్చి నెలలో సుప్రీంకోర్టు గడప తొక్కింది. గతవారం ఈ కేసుపై వాదనలు ముగిశాయి. పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో తీర్పు వాయిదా పడింది.

నిజానికి వీవీ ప్యాట్లపై కేసులు వేయడం ఇదే మొదటిసారి కాదు. గతంలో సుబ్రమణ్యంస్వామి కేసులో సుప్రీంకోర్టు స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు జరిపేందుకు వీవీప్యాట్లు తప్పనిసరని, వాటికి అవసరమైన సరంజామా ప్రభుత్వం సమకూర్చాలని ఆదేశించింది. కాగా, 50 నుంచి 100 శాతం వీవీప్యాట్ల లెక్కింపు జరపాలని వివిధ రాజకీయపార్టీల నుంచి ఎన్నికల సంఘానికి విజ్ఞప్తులు అందాయి. అధిక సమయం పడుతుందనే వంకతో ఎన్నికల సంఘం వాటిని తిరస్కరిస్తూ వస్తున్నది. తాజా కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కొన్ని కీలక వ్యాఖ్యలు చేసింది. ఈవీఎంలను మొత్తంగా ఎత్తివేయాలన్న ప్రతిపాదనను తిరస్కరించింది. మళ్లీ బ్యాలెట్ పేపర్లను ప్రవేశపెట్టాలన్న సూచనలను కొట్టిపారేసింది. వీవీ ప్యాట్ల లెక్కింపు వ్యవహారంపై అంతిమ తీర్పు ఎలా ఉండబోతోందన్న ఊహాగానాలను అలా ఉంచితే ప్రజలకు ఈవీఎంలపై అనుమానాలు కలగడానికి బలమైన కారణం డాటా భద్రత. ఎలక్ట్రానిక్ డాటా సైబర్ ప్రపంచంలో నిక్షిప్తమై ఉంటుంది. అదొక మాయా ప్రపంచం.. అక్కడ ఏమైనా జరగొచ్చుననే భావన సర్వత్రా ఉన్నది. ఆన్‌లైన్ మోసాల యుగంలో ఇది సహజమే. ఈవీఎంలను గట్టిగా వ్యతిరేకించేవారు ఈ తరహా భయాలను తమ వాదనలకు దన్నుగా ఉపయోగించుకుంటున్నారు. 2017 యూపీ ఎన్నికల తర్వాత బీఎస్పీ అధినేత్రి మాయావతి తమ ఓటమికి ఈవీఎంల గోల్‌మాలే కారణమని ఆరోపించి సంచలనం సృష్టించారు.

ఈవీఎంల ఉపయోగాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీకి చెందిన జీవీఎల్ నరసింహారావు ఏకంగా 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం' అనే పుస్తకాన్నే రాశారు. మరోవైపు అభివృద్ధి చెందిన దేశాల ఉదాహరణ ఉండనే ఉంది. అగ్రరాజ్యం అమెరికాలో ఈవీఎంలపై దుమారం చేలరేగింది. అటు యూరప్‌లో నెదర్లాండ్స్ ఈవీఎంలను ఎంత ప్రేమగా అక్కున చేర్చుకున్నదో అంతే వేగంగా వాటిని వదిలించుకున్నది. జర్మనీ కూడా పేపర్ బ్యాలెట్‌ను తప్పనిసరి చేసింది. భారత్ వంటి పెద్ద దేశంలో ఎన్నికల నిర్వహణ అనేది కొండలెత్తడం లాంటి కష్టసాధ్యమైన విషయమని సర్వోన్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్య ఎంతమాత్రం సత్యదూరం కాదు. అయినప్పటికీ ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం వీవీప్యాట్ల లెక్కింపు పెంచితే తప్పేముందన్న వాదనను కొట్టిపారెయ్యలేం. కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష ఇండియా కూటమి గత డిసెంబర్ లో 100 శాతం వీవీప్యాట్ల లెక్కింపును డిమాండ్ చేస్తూ తీర్మానాన్ని ఆమోదించింది. ఫలితాల ప్రకటనలో కొద్దిపాటి జాప్యంతో వచ్చే నష్టమేమీ ఉండదు. ఆ జాప్యం వల్ల అపనమ్మకం స్థానంలో విశ్వసనీయత ఏర్పడితే ప్రజాస్వామ్యంలో అంతకుమించి కావాల్సింది ఏముంది!

స్వాభిమానం లేని సీపీఎం

సీపీఎంకు సంబంధించి ఈ వారం ఆశ్చర్యకరమైన విషయం ఒకటి చోటుచేసుకున్నది. అది ఆ పార్టీ శ్రేణులకు, అభిమానులకు బాధ కూడా కలిగించి ఉండాలి. కానీ స్వయంగా పార్టీ నాయకత్వానికి ఎటువంటి స్వాభిమానం ఉన్నట్టు కనిపించటం లేదు. ఆశ్చర్యకరమైన విషయం అదే. ఇంతకూ జరిగిందేమిటి? కేరళ లో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ సీపీఎంపై తీవ్రమైన విమర్శలు, ఆరోపణలు చేశారు.

తర్వాత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ హోదాలో వెళ్లి అంతకన్న దారుణమైన విమర్శలు, ఆరోపణలు చేశారు. తామంతా ఇండియా కూటమి భాగస్వాములమనే విషయాన్ని ఎందువల్లనో గానీ ఇరువురూ గాలికి వదిలివేశారు. వీనంతటిపై కేరళ సీపీఎం స్పందనలు ఏమిటో తెలియదు గాని, తెలంగాణ సీపీఎం మాత్రం అంతా దిగమింగి, 24 గంటలైనా గడవకముందే ఇక్కడి కాంగ్రెస్‌తో లోక్‌సభ ఎన్నికల విషయమై బేరసారాలకు కూర్చున్నది.

టంకశాల అశోక్

సీపీఎం, కాంగ్రెస్‌లు రెండూ ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు. బీజేపీ తమ ఉమ్మడి ప్రత్యర్థి అని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, సెక్యులరిజాన్ని పరిరక్షించేందుకు కూటమి పార్టీలన్నీ కలిసిపోరాడగలవని ప్రకటించాయి. ఈ మాట కొన్ని మాసాలుగా చెప్తున్నప్పుడు దేశ ప్రజలకు కలిగే అభిప్రాయం ఎట్లా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. యథాతథంగానే ఇండియా కూటమిలో ఉండవలసినంత ఐక్యత లేదు. ఆ వివరాలు అందరికీ కనిపిస్తున్నవే అయినందున మళ్లీ రాయనవసరం లేదు. ఆ స్థితి కారణంగా దేశ ప్రజలకు అపనమ్మకాలు ఏర్పడుతుండగా, బీజేపీకి ధైర్యం పెరుగుతున్నది. ఇది చాలదన్నట్టు ఇండియా కూటమి పార్టీలు ఇంతవరకు తమ లక్ష్యాలపై ఉమ్మడి పత్రం ఏదీ ప్రకటించలేకపోయాయి.

ఇటువంటి స్థితిలో కాంగ్రెస్, వామపక్షాలు ఏ విధంగా వ్యవహరించాలి? ఆ కూటమిలో ఇవి మాత్రమే దేశమంతటా ఉనికి గల పార్టీలు. తక్కినవన్నీ ఆయా రాష్ట్రాలకు పరిమితమైనవి. వామపక్షాలు సీట్లను బట్టి నామమాత్రమే కావచ్చుగాక. కాని వాటి ఉనికి అనేక రాష్ట్రాలలో ఉంది. సిద్ధాంతం కారణంగా కొంత గౌరవ ప్రతిష్టలున్నాయి. కేరళలోనైతే మంచి బలంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నది. ఆ ప్రభుత్వం అక్కడ అసాధారణమైన రీతిలో వరుసగా రెండవసారి అధికారానికి వచ్చింది. అభివృద్ధి, సంక్షేమాల విషయంలో 'కేరళ నమూనా' అనేది ఒకటి నానుడిలో ఉంది. ప్రస్తుత సందర్భానికి సంబంధించి ముఖ్యంగా గమనించవలసినదేమంటే, అక్కడ బీజేపీని, సంఘ్‌పరివార్‌ను మొదటినుంచి అన్నివిధాలా ఎదుర్కొని నిరోధిస్తున్న ఖ్యాతి వామపక్షాలది మాత్రమే. అటువంటి ప్రతిష్ట కాంగ్రెస్‌కు ఎంత మాత్రం లేదు.

వీటన్నింటిని పరిగణనలోకి తీసుకున్నప్పుడు సీపీఎం తదితర వామపక్షాల పట్ల కాంగ్రెస్ ఏ విధంగా వ్యవహరించాలి? కేరళలోని సీట్ల కోసం ఇరువురూ పోటీ పడుతున్నందున మైత్రీపూర్వక ఘర్షణను ఒక మేరకు అర్థం చేసుకోవచ్చు. ఆ క్రమంలో కొన్ని పరస్పర విమర్శలు కూడా సహజం. కాని రాహుల్, రేవంత్‌ల తీరు దిగ్భ్రమ కలిగించేవిధంగా ఉంది. వారన్నమాటలేమిటి? కేరళ ముఖ్యమంత్రి విజయన్ కుటుంబం బంగారం దొంగ రవాణాలో దోషి. అయినప్పటికీ మోదీ ప్రభుత్వం ఇతర ముఖ్యమంత్రుల వలె ఆయన వెంట పడటం లేదు. వారి మధ్య రహస్య ఒప్పందం ఉంది. విజయన్ పైకి సెక్యులర్ వలె కన్పిస్తారు గానీ, అంతర్గతంగా మతతత్వవాది, వగైరా. ఇందులో ఆర్థిక నేరారోపణ, మతతత్వ ఆరోపణ, రహస్య ఒప్పంద ఆరోపణలున్నాయి. ఇదంతా నిజమని వాదన కోసం ఒప్పుకుందాం. ఇవన్నీ చాలా తీవ్రమైన విషయాలు. అటువంటప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమిలో సీపీఎంతో పాటు ఎందుకు భాగస్వామి అయినట్టు? వాస్తవానికి మనకు అర్థమైనంతవరకు, సెక్యులరిజం పట్ల గాని, ఆర్థికపరమైన నీతి విషయంలో గాని వామపక్షాలకు గల నిబద్ధత కాంగ్రెస్‌కు ఎంతమాత్రం లేదు. ఆ చర్చలోకి ఇక్కడ పోలేము గాని అవి దేశానికంతా తెలిసిన విషయాలే. అటువంటి పార్టీ నాయకులు ఎన్నికల సందర్భానికి తగినట్టు విజయన్ పరిపాలనపై విమర్శలకు పరిమితమై ఉంటే ఆక్షేపించవలసింది ఉండదు. కాని వారు తమ అపరిపక్వతతో శృతిమించారు.

మరొకటి కూడా ఉంది. కాంగ్రెస్ పార్టీ తన ఒకప్పటి ప్రాభవాన్ని కోల్పోయి పరమ దీనావస్థలో ఉంది. దేశంలో 28 రాష్ట్రాలలో వారు పాలిస్తున్నది కేవలం మూడింటిని. కేంద్రంలో పదేండ్ల కిందట కోల్పోయిన అధికారాన్ని ఈసారైనా సాధించటంపై వారికే నమ్మకం ఉన్నట్టు లేదు. ఇతర పార్టీలపై ఆధారపడి కొన్ని సీట్లు గెలవటం తప్ప. ఇక రాహుల్‌గాంధీది ఒక విఫల నాయకత్వమన్నది కాంగ్రెస్‌తో పాటు ఇతరత్రా ఏర్పడిన ఏకాభిప్రాయం వలె తోస్తున్నది. లోగడ కాంగ్రెస్ 2004లో కేవలం అతిపెద్ద పార్టీగా అధికారాన్ని చేపట్టినప్పుడు, స్వయంగా సోనియా గాంధీ సీపీఎం కార్యాలయానికి వెళ్లి మద్దతు కోరటం మనకు గుర్తున్నది. అప్పటినుంచి 20 ఏండ్ల తర్వాత రాహుల్‌గాంధీ తిరిగి అదే వామపక్షాలతో పాటు ఇతరుల మద్దతుతో కొన్ని సీట్లయినా గెలవాలని వెంపర్లాడుతూ ఇండియా కూటమిని తయారుచేశారు. విశేషమేమంటే, ఆ కూటమి గెలవటం మాట ఎట్లున్నా, ఒకవేళ గెలిస్తే కూటమి నాయకత్వం ఎవరిదో ఆ పార్టీలు ఇంకా ప్రకటించకున్నా, ఆ పార్టీ, ఆ నాయకుడు మాత్రం ప్రధానమంత్రి రాహులేనని తమకు తాము తలపోసుకుంటున్నారు. విషయం ఏమంటే, ఈ పరిస్థితులు ఉన్నప్పుడు రాహుల్ గాని, ఆయన పార్టీ నాయకులు గాని ఇతర భాగస్వామ్య పార్టీల పట్ల గౌరవ మర్యాదలు చూపటం వారికే మంచిది. ఇది కనీస రాజకీయ ఇంగితం. అటువంటి ఇంగితం లేనందున ఇప్పటికే కొన్ని పార్టీలతో సమస్యలు తలెత్తాయి. నితీశ్, మమత, అఖిలేశ్, కేజ్రీవాల్ వంటి బలమైన నాయకులతో ఏమి జరిగిందో తెలిసిందే. ఇప్పుడు విజయన్‌తో పేచీ. అసలే కకావికలుగా మారుతూ ప్రజల దృష్టిలో మరింత బలహీనపడుతూ బీజేపీకి పరోక్ష బలంగా మారుతున్న రాహుల్‌గాంధీ అపరిపక్వత, రాజకీయాల్లో ప్రవేశించి సరిగా 20 ఏండ్లు గడిచినా కలగని వివేకం, ఆయనను తన జీవితకాలంలో ఎప్పటికైనా ప్రధానమంత్రి చేయగలవా అనే ప్రశ్నను రేకెత్తిస్తున్నాయి.

పోతే, మన ప్రస్తుత చర్చకు ఇదంతా పూర్వరంగం వంటిది. అసలు విషయం, దీనంతటి నేపథ్యంలో తెలంగాణ సీపీఎం ఏమి చేస్తున్నదనేది. రాహుల్, రేవంత్‌లు కేరళ వెళ్లి పినరాయి విజయన్ గురించి పైన పేర్కొన్న మూడు విధాలైన విమర్శలు, ఆరోపణలు చేసిన దృష్ట్యా ఇక్కడి సీపీఎం నాయకత్వం ఏమి చేసిందన్నది గమనించదగినదిగా మారింది. ఆ మరునాడే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సీపీఎం కార్యాలయానికి వెళ్లి, లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. తాము భువనగిరిలో పోటీ చేస్తున్నామని, తమను అక్కడ బలపరచాలని, తక్కిన చోట్ల కాంగ్రెస్‌కు మద్దతిస్తామని సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. అది సాధ్యం కాదని, తర్వాత ఎమ్మెల్సీ, ఒక కార్పొరేషన్ ఇచ్చే విషయం పరిశీలిస్తామని విక్రమార్క చెప్పారు. ఈ విషయం పార్టీలో చర్చిస్తామని, అయితే బీజేపీని ఓడించాలి గనుక కాంగ్రెస్‌ను బలపరచటం జనరల్ లైఖరి అని వీరభద్రం సూచించారు.

ఈ రాజకీయ కోణం అంతా సరేగాని, వారి సమావేశం జరిగినప్పుడు, కేరళలో తమ ముఖ్యమంత్రిపై రేవంత్‌రెడ్డి చేసిన (రాహుల్ మాట పక్కకుపెట్టినా) దారుణమైన విమర్శలు, ఆరోపణల గురించి విక్రమార్కతో వీరభద్రం (కాకతాళీయంగా ఇద్దరి పేర్లూ వీరత్వాన్ని సూచించేవే) ఏమైనా అని ఉంటారా, అంటే ఏమిటన్నది ఆసక్తికరమైంది.

ఇతర పత్రికలు అయితే బూర్జువా పత్రికలంటారని మొదలు సీపీఎం పత్రిక నవ తెలంగాణ చూడగా అందులో ఈ వాక్యం కన్పించింది. '(కేరళ)కు పోయి రేవంత్‌రెడ్డి బీజేపీతో సీపీఐ (ఎం)కు సంబంధాలున్నాయని వ్యాఖ్యానించటం సరైంది కాదని సూచించారు'. అంతకుమించి మరేం లేదు. అదే రోజున ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మరొకమెట్ట మాట్లాడుతూ మరికొన్ని వ్యాఖ్యలు చేశారు. కాని భట్టితో వీరభద్రం సమావేశం గురించిన వార్తలో ఉన్నది మాత్రం అంతవరకే. ఎన్నికల పొత్తులపై చర్చ వార్తలో దీనివల్ల రసభంగం కలుగుతుందని భావించారేమో తెలియదు.

ఇటువంటి తీవ్రమైన అవమానాన్ని దిగమింగటం మతతత్వ శక్తులను ఓడించేందుకు అవసరమని రాష్ట్ర సీపీఎం నాయకత్వం వివరించబూనవచ్చు. కాని ఆ శక్తులను ఓడించటం కోసం భాగస్వామ్య పక్షాలతో సవ్యంగా వ్యవహరించటం అవసరమని రాహుల్‌గాంధీ గాని, రేవంత్‌రెడ్డి గాని భావిస్తున్నట్టు లేరు. అంతేకాదు, తామేమి చేసినా వామపక్షాలు దిగమింగి తమ వెంట పడి ఉంటాయనే నమ్మకం వారికి చాలా ఉందన్నది స్పష్టం. ఇక్కడ ఇప్పటికే సీపీఐ అట్లా పడి ఉన్నప్పుడు సీపీఎం మాత్రం ఎందుకుండదు? మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు ఇవ్వటం, తర్వాత మరేవో ఇస్తామనటం సీపీఐ విషయంలో పనిచేయలేదా? అటువంటివేవో ఇవ్వజూపితే సీపీఎంకు మాత్రం సరిపోవా?

అయినా, పెక్కుభంగుల వివేకభ్రష్ట సంపాతములో అని విజ్ఞులు ఎప్పుడో చెప్పలేదా? ఉభయ కమ్యూనిస్టులకు సఖ్యత ఎన్నడూ లేదు. సీట్ల కోసం ఎవరిదారి వారిదే కదా. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తమ ఐక్యత గురించి, ఐక్య కార్యాచరణల గురించి, వామపక్ష- ప్రజాస్వామిక శక్తులను కలుపుకొని పోవటం గురించి, రాష్ట్రంలోని అధికారపక్షానికి ప్రత్యామ్నాయం కావటం గురించి వారు చేసిన ప్రతిజ్ఞలతో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రతిధ్వనించింది. అప్పటినుంచి పదేండ్లు గడిచిపోయాయి. ఈ మధ్యకాలంలో ఏమేమి జరిగిందనేది చెప్పుకోవటం వృథా. ప్రస్తుతం మాత్రం మరొకమారు ఎవరి దారి వారు చూసుకుంటుండగా, చివరికి పరిస్థితి ఎటువంటి అవమానాలనైనా ఏదో సాకులు చెప్పి దిగమింగేవరకు దిగజారింది. కనీసం స్వాభిమానమైనా లేని పతనాన్ని ఎవరు మాత్రం గౌరవిస్తారు గనుక.

ఉభయ కమ్యూనిస్టులకు సఖ్యత ఎన్నడూ లేదు. సీట్ల కోసం ఎవరిదారి వారిదే కదా. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తమ ఐక్యత గురించి, ఐక్య కార్యాచరణల గురించి, వామపక్ష- ప్రజాస్వామిక శక్తులను కలుపుకొని పోవటం గురించి, రాష్ట్రంలోని అధికారపక్షానికి ప్రత్యామ్నాయం కావటం గురించి వారు చేసిన ప్రతిజ్ఞలతో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రతిధ్వనించింది. అప్పటినుంచి పదేండ్లు గడిచిపోయాయి.

ఇక వయనాడ్ వంతు వచ్చింది!

రాకేశ్ కందుకూరి
91006 42346

మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన నాటినుంచి ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ, రాయ్‌బరేలీ పార్లమెంట్ నియోజకవర్గాలు నెహ్రూ కుటుంబానికి కంచుకోటలుగా ఉన్నాయి. ఫిరోజ్‌గాంధీ నుంచి మొదలుకొని ఇందిరాగాంధీ, రాజీవ్, సోనియా, రాహుల్ వరకు ఆ కుటుంబానికి చెందిన నేతలందరూ ఆ స్థానాల నుంచి పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించారు. అయితే కాంగ్రెస్ అగ్రనాయకుల ఒకప్పటి కంచుకోటలు బద్దలయ్యాయా? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. ఆ రెండు స్థానాలకు కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు అభ్యర్థులను ప్రకటించకపోవడమే అందుకు నిదర్శనం. మరోవైపు రాయ్‌బరేలి సిట్టింగ్ ఎంపీ సోనియా గాంధీ రాజ్యసభకు ఎన్నికవడంతో ఈ అనుమానాలకు మరింత బలం చేకూరింది.

హస్తం పార్టీ కంచుకోటలైన అమేథీ, రాయ్‌బరేలి నుంచి నెహ్రూ కుటుంబానికి చెందినవారు పోటీలో నిలుస్తారా? లేదా? అనేది ఇప్పటికీ తేల లేదు. దీంతో ఇదే అంశాన్ని ప్రస్తావిస్తున్న అధికార బీజేపీ.. కాంగ్రెస్‌ను ఇరుకున పడేస్తున్నది. క్యాడర్‌లో నూతనోత్సాహం నింపాల్సిన నాయకత్వమే వెనుకడుగు వేస్తుండటంతో కార్యకర్తలు నైరాశ్యంలోకి కూరుకుపోతున్నారు.

మరోవైపు ఈ రెండు స్థానాల విషయంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నది. వయనాడ్‌లో రాహుల్‌గాంధీ ఓటమిని ఊహించిన ఆ పార్టీ అమేథీ విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నదని విశ్లేషకులు అంటున్నారు. వ్యతిరేకత ఎక్కువగా ఉన్నందున పోటీకి దూరంగా ఉండాలని కేరళ సీఎం విజయన్.. రాహుల్‌కు సూచించినట్టు తెలుస్తున్నది. విజయన్ సూచనలను రాహుల్‌గాంధీ పెడచెవిన పెట్టడంతో ఈ సీటును విజయన్

ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. బలమైన అభ్యర్థి అన్నీ రాజాను బరిలో దించడంతో రాహుల్‌గాంధీ ఎదురీదుతున్నారు. మరోవైపు బీజేపీ కూడా తన బలాన్ని చాటుకునేందుకు రాష్ట్ర అధ్యక్షుడు కే.సురేంద్రన్‌ను బరిలోకి దించింది.

ఈ పరిణామాల మధ్య వయనాడ్‌లో ఓటమి ఎదురయ్యే అవకాశం ఉందని భావించిన కాంగ్రెస్ రాహుల్‌ను అమేథి నుంచి కూడా బరిలో దించాలని ప్రణాళికలు రచిస్తున్నట్టు తెలుస్తున్నది. ప్రత్యామ్నాయంగా అమేథీని ఎంచుకున్నట్టు విశ్లేషకులు చెప్తున్నారు. ఇండియా కూటమి పొత్తులో భాగంగా సమాజ్‌వాదీ పార్టీ మద్దతు కూడగట్టుకొని అమేథీపై మరోసారి పట్టు సాధించాలని, తద్వారా ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకురావాలని రాహుల్ యోచిస్తున్నారు. సోనియా ఖాళీ చేసిన రాయ్‌బరేలి నుంచి ప్రియాంకా వాద్రాను పోటీ చేయించాలని నిర్ణయించారు. అమేథీ అభ్యర్థిని ప్రకటించకుండా రాయ్‌బరేలి అభ్యర్థి పేరును ప్రకటిస్తే అనుమానం వస్తుందనే కారణంగానే ముందుగా ప్రకటించలేదు.

ఈ వ్యూహం వెనుక ఉన్న మతలబు ఏంటంటే.. ఒకవేళ ముందస్తుగానే రెండుచోట్ల రాహుల్ పేరును ప్రకటిస్తే మొదటికే మోసం వస్తుంది. అమేథీలో మరోసారి రాహుల్ పోటీ చేస్తున్నారని తెలిస్తే వయనాడ్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు డీలా పడిపోతారు. 'అమేథీలో ఎలాగూ పోటీ చేస్తున్నారు. ఒకవేళ వయనాడ్‌లో రాహుల్‌ను గెలిపించినా రాజీనామా చేసి వెళ్లిపోతారు' అనే ప్రచారం జోరందుకుంటే ప్రజలు తిరస్కరించే ప్రమాదమూ లేకపోలేదు. ఈ విషయాన్ని పసిగట్టిన కాంగ్రెస్.. కేరళలో ఏప్రిల్ 26న పోలింగ్ ముగిసిన వెంటనే రాయ్‌బరేలి, అమేథీ స్థానాల అభ్యర్థులను ప్రకటించాలని యోచిస్తున్నదని విశ్లేషకులు చెప్తున్నారు. ఏదైనప్పటికీ అమేథీతో పాటు వయనాడ్‌లోనూ రాహుల్‌గాంధీ ఓడిపోతే మాత్రం ఆయన రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడం ఖాయం.



కోర్టు తీర్పులూ రాస్తున్నారా?

న్యాయ వ్యవస్థను, కోర్టు తీర్పులను బీజేపీ నేతలు ప్రభావితం చేస్తున్నారు. కోర్టు తీర్పుతో టీఎంసీపై బాంబు పేలుతుందని బీజేపీ నేత సువేందు అధికారి ముందే ప్రకటించేశారు. తీర్పులు కూడా బీజేపీ నేతలే రాస్తున్నారా? ఒకవేళ తీర్పులు వాళ్లు రాయకపోతే కోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందో ఆయనకు ముందే ఎలా తెలుసు?

- మమతా బెనర్జీ
పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి

2024-25 విద్యా సంవత్సరం నుంచి దేశవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థలలో పీహెచ్‌డీ ప్రవేశాలకు జాతీయ అర్హత పరీక్ష (నెట్) నిర్వహించాలనడం యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని ధ్వంసం చేయడమే. ఆయా వర్సిటీలు సొంతంగా నిర్వహించే ప్రవేశ పరీక్ష స్థానంలో నెట్‌ను నిర్వహించాలంటూ దళిత, బహుజన విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కులోన్మాద కుట్రలను విద్యార్థి లోకం తిప్పికొట్టాలి.

దళిత, బహుజనులకు విద్య దూరం

ఆవుల నాగరాజు

మార్చి 13వ తేదీన న్యూ ఢిల్లీలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ యూనివర్సిటీలు సొంతంగా నిర్వహించే పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష స్థానంలో జాతీయస్థాయిలో ఏక పరీక్ష (నెట్)ను ప్రవేశపెట్టారు.

ఈ నూతన పరీక్ష విధానంలో నెట్‌ను మూడు కేటగిరీలుగా విభజించారు. అందులోని 1వ కేటగిరీలో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి అర్హత ఇచ్చారు. 2వ కేటగిరిలో ఫెలోషిప్ ఇవ్వకుండా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికే అర్హత ఇచ్చారు. ఇక 3వ కేటగిరిలో ఫెలోషిప్ గాని, అదేవిధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి అర్హత ఇవ్వకుండా పీహెచ్‌డీ కోర్సుల్లో చేరేందుకు మాత్రమే అర్హత ఇచ్చారు. దాన్ని కూడా ఏడాదికే పరిమితం చేశారు. నెట్ పరీక్ష ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఉండటంతో దక్షిణ భారతదేశ విద్యార్థులు పరీక్షల్లో అధిక మార్కులు సాధించలేరు. దీంతో కేటగిరి-1లో వీరు ఫెలోషిప్ పొందలేరు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి అర్హత కూడా కోల్పోతారు. వివిధ యూనివర్సిటీల్లో ఏటా పీహెచ్‌డీ ఖాళీలు భర్తీ చేసేందుకు తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించాలనే విధానం లేకపోవడం వల్ల యూజీ నెట్‌లోని 3వ కేటగిరి సాధించినప్పటికీ విద్యార్థులు ఏడాది కాల పరిమితి నిబంధన వల్ల కనీసం అడ్మిషన్ కూడా పొందలేని పరిస్థితి ఏర్పడనున్నది.

గ్రామీణ ప్రాంత విద్యార్థులు, రాష్ట్ర భాషలు, మాతృ భాషలలో చదువుకున్న విద్యార్థులు, పేద, దళిత, బహుజన విద్యార్థులు పట్టణాల్లోని ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలో ఇంగ్లీష్ భాషలో చదివే విద్యార్థులకు పోటీ ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతున్నది. అనేక కష్టనష్టాలు, అణచివేతకు, అవమానాలకు గురై పీజీ వరకు చదువుకున్న దళిత, బహుజన విద్యార్థులు ఈ నిర్ణయంతో ఉన్నత విద్యాసంస్థల నుంచి గెంటివేయబడుతారనేది నూటికి నూరుపాళ్లు వాస్తవం.

పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ఈ విషయాన్ని బహిర్గతం చేసిన యూజీసీ సంస్థ విద్యార్థుల ఆందోళనలను ఎలక్షన్ కోడ్ పేరుతో అణచివేసే ఉద్దేశంతోనే చేసింది. కొత్త విద్యా విధానం-2020 అమలులో భాగంగానే ఈ ఏకపరీక్ష విధానాన్ని ప్రవేశపెడుతున్నామని ఈ సందర్భంగా ప్రకటించిన యూజీసీ తొందరలోనే తన అస్తిత్వాన్ని కోల్పోయి రద్దయ్యే పరిస్థితి కూడా ఉన్నది.

కొత్త విద్యా విధానంలోనే యూజీసీని రద్దు చేయాలని, ఆ స్థానంలో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడిచే హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (హెచ్‌ఈసీఐ) ఏర్పాటు చేయాలని ఉంది. గత కొన్నేండ్లుగా ఎంతోమంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించిన యూజీసీని కూడా కనుమరుగు చేసే పరిస్థితి నేడు నెలకొన్నది. ఈ దేశ పాలకులు అనుసరించిన విధానాలతో ఇప్పటికే భారత విద్యా విధానంలో కొందరికే విద్య అనే పరిస్థితికి నెట్టివేయబడింది. విద్య కాషాయీకరణ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణతో పూర్తి కేంద్రీకరణకు పూనుకున్నది. ప్రధాని మోదీ నాయకత్వ